క్లుప్తంగా

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

భైంసాటౌన్: ఆర్‌ఎంపీలకు శిక్షణపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని ఆర్‌ఎంపీల సంఘం డివిజన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ప్రక్రియ ప్రారంభించి గ్రామీణ వైద్యులను ఆదుకోవాలన్నారు. శిక్షణతోపాటు, సర్టిఫికెట్లు అందించి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ కార్యదర్శి సాగర్, భైంసా మండలాధ్యక్షుడు అర్జున్‌పటేల్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ ఉన్నారు.

'ఆశవర్కర్ల హామీలు నెరవేర్చాలి'

కుంటాల: ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కుంటాల వైద్యశాలలో బుధవారం స్టాఫ్‌నర్స్ సంతోషికి ఆశవర్కర్లు వినతిపత్రం అందజేశారు. 15 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 18న ఎమ్మెల్యేకు, 22న కలెక్టర్‌కు వినతి పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం మండల కన్వీనర్ ఇంద్రమాల, కార్యకర్తలు మమత, దేవకి, లక్ష్మి, విజయ, సంతోష తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: హైదరాబాద్‌లో ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు తరలిరావాలని తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమసంఘం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, కృష్ణస్వామి, సభ్యులు కాశీనాథ్, గంగాధర్, ఎల్లయ్య, నర్సయ్య, రాజేశ్, మల్లేశ్, లవకుమార్, సాయి, సత్యం, రాజు, శ్రీనివాస్, నాగరాజు, నవీన్, సతీశ్, సుమన్, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులున్నారు.

సోన్‌లో వారసంత ప్రారంభం



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సోన్: మండలంలోని పాక్‌పట్లలో గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా వారసంతను ప్రారంభించారు. ప్రతి బుధవారం నిర్వహించే వారసంతలో కూరగాయలు, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయని గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వి ని యోగం చేసుకోవాలని వీడీసీ సభ్యులు కోరారు. వీడీసీ సభ్యులు నర్సారెడ్డి, సాయేందర్, గంగన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాల విడుదల హర్షణీయం



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు ప్రభుత్వం ప్రతి నెలా వేతనాలు చెల్లించాలన్నారు. వారిని క్రమబద్ధీకరించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో లింగన్న, జేవింద్, చిన్నరాజన్న, దేవేందర్ తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ పూడ్చివేశారని ఫిర్యాదు

మామడ: మండలంలోని న్యూలింగంపల్లి గ్రామంలో డ్రెయినేజీని మట్టితో పూడ్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు గిరిపాల్, శేఖర్, నవీన్, వెంకటరమణ బుధవారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీ పూడ్చివేతతో మురికినీరు నిలిచి కాలనీవాసులకు ఇబ్బందిగా మారుతుందని పేర్కొన్నారు.

మోటార్‌కు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలోని ఇంద్రనగర్‌లో తాగునీరు సరఫరా చేసే మోటార్ మూడు రోజుల కిందట కాలిపోగా.. కాలనీవాసులు కౌన్సిలర్ పరిమిలతసురేశ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ వెంటనే మున్సిపల్ సిబ్బందిచే దగ్గరుండి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది జావిద్ తదితరులున్నారు.

తొలి ఏకాదశి వేడుకలు



సోన్: న్యూవెల్మల్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వీడీసీ సభ్యులు, భక్తులు



కుభీర్ విఠలేశ్వరస్వామి ఆలయంలో..



నిర్మల్‌లోని దేవరకోట ఆలయంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ దంపతుల పూజలు



నిర్మల్ దేవరకోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లోకేశ్వరం: బాగాపూర్ రాజ్యలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో భక్తుల పూజలు



తానూరులో..

జిల్లావ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సమీపంలోని వేంకటేశ్వరస్వామి, విఠలరుక్మాబాయి, శ్రీ ఉమమహేశ్వరస్వామి, శ్రీకృష్ణ, పశుపతినాథ్, శివాలయం, సాయిబాబా తదితర ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పంచామృతాభిషేకం, అష్టోత్తరసేవ, తులసి పుష్పార్చన, సాముహిక విష్ణు సహస్ర పారాయణం, సత్యనారాయణ వ్రతాలు, కుంకుమార్చన, అఖండ నామ స్మరణ, సహస్ర దీపాలంకరణ, పల్లకిసేవ, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యాంచ గ్రామంలో శ్రీ విఠలేశ్వర ఆలయాన్ని బాసర మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట, గండిరామన్న సాయిబాబా ఆలయం, నాగేశ్వరవాడ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నిర్మల్ దేవరకోట దేవస్థానంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ దంపతులు, ఆర్డీఓ రత్నకల్యాణి, బాసర అటవీ అధికారి శర్వణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భైంసారూరల్: ఖథ్‌గాంలో విఠలరుక్మాయి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కుంటాల : ఓలాలోని విఠలరుక్మాబాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



భైంసాలోని రాధాకృష్ణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో మార్వాడీ సంఘ మహిళలు



జిల్లా కేంద్రంలోని ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఈరోజు

రైతు రుణమాఫీపై సంబరాలు

భైంసాటౌన్: పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో గురువారం రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

లక్ష్మణచాంద: రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం నాలుగు గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడతారని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏవో ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులు లక్ష్మణచాంద రైతువేదికలో నిర్వహించే సంబురాల్లో పాల్గొనాలని కోరారు.

బాసర: సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణమాఫీపై మాట్లాడనున్నందున మండల పరిధిలోని క్లస్టర్ రైతులు రైతువేదిక వద్ద నిర్వహించే సంబురాల్లో పాల్గొనాలని ఏఈఓ అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ముధోల్: సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రైతులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడతారని ఏవో భాస్కర్ తెలిపారు. రైతులు మండల కేంద్రంలోని రైతువేదిక వద్దకు రావాలని కోరారు.

సోన్: రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారని ఏఓ వసంత్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించే సంబురాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?



ధర్మారం నుంచి మల్లాపూర్ వెళ్లే మార్గంలో బురద



మునిపెల్లి మజీద్ సమీపంలో గుంతల రోడ్డు



పార్‌పెల్లి-మల్లాపూర్ మధ్య రోడ్డు దుస్థితి

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు ఏర్పడటంతో పాటు చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు కారణంగా గుంతలు తెలియక వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

దెబ్బతిన్న రోడ్లు..

- మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్ వెళ్లే మార్గంలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది.
- మల్లాపూర్ నుంచి మునిపెల్లికి వెళ్లే రోడ్డు కిలోమీటర్ మేర గుంతలమయంగా తయారైంది.
- మల్లాపూర్ నుంచి పార్‌పెల్లి వెళ్లే రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- చామన్‌పెల్లి నుంచి మునిపెల్లి వెళ్లే రోడ్డు కిలోమీటర్ మేర గుంతలమయంగా మారింది.

ఇబ్బందుల మధ్య ప్రయాణం..

మండలంలోని ధర్మారం-మల్లాపూర్ రోడ్డు, మల్లాపూర్-మునిపెల్లి రోడ్డు, మాచాపూర్, పార్‌పెల్లి, చామన్‌పెల్లి నుంచి మునిపెల్లికి వెళ్లే రోడ్లు పూర్తిగా బురదమయంగా మారాయి. ఈ గుంతల రోడ్లపై తరచుగా అదుపుతప్పి కింద పడుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు.

బురదమయంగా రోడ్డు



ధర్మారం నుంచి మల్లాపూర్ వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో బురదమయంగా మారింది. వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. – మహేందర్, ధర్మారం

చర్యలు చేపట్టాలి



మండలంలోని పలు గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారాయి. నీరు నిలుస్తుండటంతో ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు. నిధులు మంజూరు చేసి రోడ్లకు మరమ్మతులు చేయించాలి. – రవి, తిర్పెల్లి

ప్రతిపాదనలు పంపాం..

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతుల విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఇబ్బంది పడకుండా చర్యలు చేపడతాం. – శ్రీధర్, పీఆర్ ఏఈ

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకర గుంతలు



లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్ గ్రామంలో సరస్వతి కాల్వ బ్రిడ్జిపై రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షపునీరు చేరడంతో గుంతలు కన్పించక వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: అంజనేశ్వర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఫోన్: 70210 07310

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



కుంటాల: కల్లూరులో పీరీల ఊరేగింపు



నిర్మల్‌లోని పంజాషా గల్లీలో బడా పంజా వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

లక్ష్మణచాంద: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ పీరీలను ఊరేగించగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని మునిపెల్లి, లక్ష్మణచాంద, పార్‌పెల్లి, మల్లాపూర్, మాచాపూర్, చింతల్ చాంద, వద్యాల్, నర్సాపూర్, కాశీగూడ, న్యూకంజర్ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండో దయ్యాడిగా మునిపెల్లి ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ ఉదయం గోదావరి జలాలను తీసుకొచ్చి పీరీలకు అభిషేకం చేశారు. పూజల అనంతరం మలిదలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పీరీల ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం నుంచి వెళితే కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో వందలాది మంది వచ్చి అగ్నిగుండం దాటారు. మామడ, సోన్, నిర్మల్, సారంగాపూర్ మండలాల నుంచి కూడా ఇక్కడకు వస్తారు. జిల్లా కేంద్రంలోని పంజేషా గల్లీలో ఏర్పాటు చేసిన పీరీల వద్దకు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆ ప్రాంగణమంతా సందడి నెలకొంది.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో పీర్లను అలంకరించి మలిద ముద్దలను సమర్పించి గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల ఎదుట అగ్నిగుండం వద్ద హిందువులు, ముస్లింలు ఆడిపాడిన అలయ్ బలయ్ కార్యక్రమం ఆకట్టుకుంది.

కుభీర్: మండల కేంద్రంలో బుధవారం డప్పుచప్పుళ్ల నడుమ పీరీల ఊరేగింపు నిర్వహించారు. పీరీలను పూలతో అలంకరించి దట్టీలు సమర్పించారు. క్మరొద్దీన్, ఎజాస్ తదితరులు ఉన్నారు.

బాసర: మండల కేంద్రంలో పీరీలను వీధుల గుండా ఊరేగించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కర్బాల దర్గా వ్యవస్థాపకులు హైమద్ హుస్సేన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సారంగపూర్: మండలంలోని తాండ్ర(జి), జామ్ గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. జామ్‌లో కరిసెల గుట్టవద్ద నిర్మించిన దర్గా వద్దకు భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరా, పిప్రి, రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

భైంసారూరల్: మండలంలోని కొతల్‌గాంలో శోభాయాత్రగా పీరీల ఊరేగింపు నిర్వహించారు.

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట, దస్తురాబాద్ గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. అనంతరం పీరీలను చెరువు వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు.



లక్ష్మణచాంద: మునిపెల్లిలో పీరీలకు అభిషేకం కోసం గోదావరి జలాలు తెస్తున్న గ్రామస్తులు



కుభీర్‌లో..



లోకేశ్వరంలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



దస్తురాబాద్‌లో పీరీలకు మొక్కుతున్న ప్రజలు



బాసరలో..

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి



మాట్లాడుతున్న సంటేన్న

లోకేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు సంటేన్న అన్నారు. బుధవారం మండలంలోని రాజూర గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు ప్రభుత్వం నామినేట్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకుడు చాకేటి లస్మన్న, లోకేశ్వరం మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, శ్రీరాములు, ముత్తగౌడ్, నవీన్, పోతన్న, ప్రవీణ్, అనిల్, రమేశ్ ఉన్నారు.

పీరీల ఊరేగింపు



తర్లపాడ్‌లో ఊరేగింపులో భక్తులు

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని తర్లపాడ్ తదితర గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు పీరీలకు పూలు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు.

ఘనంగా సాయన్న జయంతి



జయంతి నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పండుగల సాయన్న ముదిరాజ్ జయంతిని బుధవారం ముదిరాజ్ సంఘ సభ్యులు నిర్వహించారు. నిజాం కాలంలో ప్రజల మనసు దోచిన మహా నాయకుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మూదేల్ల శంకర్, పిట్ల రాజ్‌కుమార్, ప్రశాంత్, రాములు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.